ఊహిస్తావు. నమ్ముతావుకూడా. ఉట్టినే నమ్మి కూర్చోవు. పదిమందికి, చంకలెగరేసి, నీకొచ్చే సిరిసంపదల్ని, అదృష్టాన్ని, చిలువలు పలువలుచేసి, అంతంతమాత్రంగా కాకుండా, వివరించిచెపితేనేగాని నీ ఉబలాటం తీరదు. కాని చివరకు అలాటిదేమి జరగదు. పోతే మామూలుగా ఉంటుంది వర్తమానంలా, భవిష్యత్తుకూడా. ఇంతకంటె అర్ధ్వాన్నంగా ఉండకపోతే అదే పదివేలు. నీవు అనుకొన్నది అనుకున్నట్లు జరుగలేదేమీ అని విచారిస్తావు. క్రుళ్ళిపోతావు. ఇతరులకు చెప్పి బారుమంటావు. నీ అపజయాలను గురించి పెద్ద ఆర్భాటాలు చేస్తావు ఇతరులదగ్గర. చివరన అప్పటి భవిష్యత్తులో ఇప్పటి వర్తమానంకేసి చూస్తావు. దీనిక్రిందే ఉన్నా ఇప్పటికి జరిగిపోయినదానికోసం కూడా వెతకడం చాలాచోట్ల సంభవం. వెనక్కు తిరిగి, పాతను క్రొత్తతో పోల్చి చూసుకోవడం తప్పనిసరి. జరుగుతున్నది ఎలానూ జరిగినద్దాని కంటె బాగుంటుంది. ఏదో చెప్పాను బాగుంటే..."

"బాగుంది నీ వాదన. ఎవరయినా తమకు చెడు కల్గుతుందని ఊహించుకుంటారా? ఎప్పుడో చెడు కల్గుతుందని ఇప్పుడు విచారించడం వివేకవంతుల లక్షణమా?"

రామం అందుకున్నాడు- "దారికి వచ్చావు. ఆఁ! అందుకే. ముందు పెద్ద ఒరిగేదుందని ఊహించకు. అప్పుడే విచారించవలసిన అవసరం ఏ విధంగానూ కలగదు. ఎప్పుడో ఏదో పెద్దగా జరగపోతున్నదని పెద్ద ఆశలు పెట్టుకొని, అపుడు జరక్కపోతే (ఎలాగూ జరగవు అవి పేకమేడలు కనక) అప్పుడు క్రుంగి కృశించడంకంటె జరగదనుకొని సాక్షిగా ఉండటం మంచిది కాదంటావు?"

"అంటే ఎప్పుడూ నిరాశగా ఉండాలంటావు. మనకేం ముందొరగదని నిశ్చయించుకోమంటావు కదూ రామం?"

"అపుడు ఖర్మంచాలక నీకెదయినా జరిగితే సంతోషించు. నీకెదయినా మంచి జరుగుతే ఎలానూ సంతోషిస్తావు ఒకరు చెప్పక్కర్లేదు. కాని ఒకటి - అపుడు చెడు జరిగిందనుకో వెంటనే క్రుంగి కృశించవు. 'ఇలా జరిగిందేమిటా?' అని ఆశావాదిలా... ఏమంటావు ప్రసాద్?"

"నాకేం తెలియకుండా వుంది. ఏమో! కొన్నాళ్లు కావాలి ఈ విషయాలు అర్థంచేసుకోడానికి" అని ఊరుకున్నాడు ప్రసాద్.

---

స్కెచ్

# నడక సాగింది—

జోశ్యుల సూర్యనారాయణమూర్తి

"ఈ కాఫీ నేను కలుపుతాను గాని పిల్లవాడి నేడిపించక వాడికి ముందు పాలియ్యి."

"అంతమాత్రం మీకోపిక ఉంటే యికనేం?"

"అలా అనకు. ఇవ్వేళనుంచి చూడు. నేనెంత ఓపిక చూపుతానో!"

"అయితే రేపటినుంచి సూర్యుడు పడమట ఉదయిస్తాడేమో?"

"ఆ పని జరగాలంటే ముందు నీ విసుగు తగ్గాలి."

"నేనేమీ శాంతిమంతురాలినని చెప్పుకోవటం లేదు."

"అయితే నీవు వసంతవెందుకవుతావు? శాంతకుమారివయ్యేదానవు."

"పేరుకేంలెండి! మీ పేరులో ఉన్న మధువు మీ మాటల్లో వెదకినా కనబడదు."

పై సంభాషణ ఆ దంపతుల మధ్య జరిగి యిప్పటికి దాదాపు సంవత్సరమయింది. నిజంగా ఆనాడు వసంతకుగాని మధుకిగాని ఓర్పు తక్కువే. కాని యీ సంవత్సరంనుంచీ పిల్లవాడెదిగి రోజుకొక రకంగా పెంకితనము, అల్లరి జాస్తీచేసేసరికి వాడితో వేగలేక మొదట్లో వాణ్ణి జయిద్దామని ప్రయత్నించినా ఇప్పటికి వాడిచేతిలో వీళ్ళే ఓడిపోయారు. చిన్నపిల్లలముందు పెద్దవాళ్లు అందులో ముఖ్యంగా తల్లిదండ్రులు యెంతో ఓర్పుతో మెలగాలి. ఎంతో అనుభవం వున్నవాళ్లుగాని వాళ్ళు మన

స్తత్వం గుర్తించలేరు. అది వసంత, మధు పూర్తిగా యిప్పటికీ గుర్తించలేకపోయినా పిల్లల మనస్తత్వం తెలుసుకొని వాళ్ళతో కాలం గడపటంలోనే యెంతో ఆనందముందని ఆ అవ్యక్తమైన ఆనందాన్ని చూరగొనటమే తమ జీవిత పరమ లక్ష్యమని నిర్ణయించుకొన్నారు. ఏడాది క్రిందట పిల్లవాడు పోరుపెట్టి యేడుస్తూ ఉంటే యేం చెయ్యాలో తెలియక వసంత జుట్టు పీక్కొని చిందులు తొక్కేది. ఆ రోజుల్లో పిల్లలఏడుపు చెవినిబడితే మధు మైలుదూరం పరుగెత్తేవాడు. వాళ్ళ కొంపలో ఈమధ్య కాలంలో అనుభవంగల ఏ ముసలమ్మా పట్టుమని పదిరోజులున్న పాపాన పోలేదు. నా అన్నవాళ్లు లేకపోయాక పరాయి పెద్దమనుష్యులు ఎవరువచ్చి ఉంటారు? ఈ కారణం చేత సంసారంలో కష్టసుఖాలు తెలిసి ఒక్కడే అయినా ఆ పిల్లవాడితో పడ్డ యాతనలు వాళ్ళకి సహజమైన అనుభవాన్ని కలిగించాయి.

* * *

చంటి పిల్లవాణ్ణి తీసుకొని మధు, వసంత ఆనాడు పార్కుకి బయలు దేరారు. ఆదివారం కాబట్టి రకరకాల మనుష్యులు, పిల్లలు, విద్యార్థులు పార్కునిండా వున్నారు. చిన్న మూడుచక్రాల సైకిళ్ళ మీద రెండుమూడు సంవత్సరాల పిల్లల్ని, వాళ్ళ నాడించటాని కేర్పడిన పిల్లలు తిప్పుతున్నారు. వసంతకు తన పిల్లవాడికికూడా అల్లాంటి వుంటే బాగుండుననే కుతూహలం దానివెనుక కొంత బాధ, ఏర్పడ్డాయి. కాని వసంత తన జీవితంలో సంపాదించిన అనుభవాన్నిబట్టి వాటి నణచి వేయటమే కాకుండా పిల్లవాడికి ఏమీ కష్టం కలగకుండా మరపించి దూరంగా తీసుకవెళ్ళగల్గింది. మధు పిల్లల మనస్తత్వంతోబాటు తల్లులు చాకచక్యంకూడ ఆ సన్నివేశంలో గుర్తించ గలిగాడు. మొక్కలు నీళ్ళు, లైట్లు చూపించి పిల్లవాణ్ణి ఆడిస్తూ ఒక మూలకు చేరుకున్నారు.

“వీడు పుట్టక పూర్వం నీకీ తెలివితేటలున్నాయా?” తాపీగా సీటుమీద చేరబడుతూ వసంత నడిగాడు మధు.

“మీరు బాగా పిల్లల మనస్తత్వం రెండు సంవత్సరాలు చదువుకొన్నారు నాకేముంది? అనుభవం మీద తెలియవలసిందే కాబట్టి యింత కాలం ఆలస్యమయింది. ఇప్పుడేనా నాకేం తెలుసు నా మొహం. ఒకొక్కప్పుడు వీణ్ణెల్లా సముదాయించాలో తెలియక సతమతమవుతూ ఉంటాను. ఏమయినా ఉద్యోగంలోకూడా నాకిదే పనికనక చాలా వరకు సహనం ఏర్పడింది.”

“ఉద్యోగాని కేంలే. నేనుమాత్రం అంతకంటె వెలగబెట్టే ఉద్యోగమేమిటి? అయితే మాత్రం నాకిన్నాళ్ళనుంచీ తెలిసినదేముంది? రెండేళ్లు నేను చదివానన్నావు. నిజంగా అదీ నాకు సిగ్గుచేటే. చదువుదారి చదువుది. ఉద్యోగందారి ఉద్యోగానిదీ అయిందిన్నాళ్ళనుంచీ. మనకిద్దరికీ కూడా చదువుచెప్పి తెలివితేటలు అబ్బించింది వీడే” అని కుర్రవాణ్ణి తల్లి ఒళ్ళోనుంచి తీసుకొని యెత్తుకొన్నాడు మధు. ఆతర్వాత వాళ్ళగత జీవిత స్మృతులలోపడి రాత్రి తొమ్మిదైన సంగతికూడా గుర్తించకుండా ఆలోచిస్తున్నారు.

* * *

మధుకి చిన్నప్పుడే పెళ్ళయింది. స్కూలు ఫైనలు తప్పి యే ఉద్యోగంచెయ్యాలో యేదైనా అసలది యెల్లా సంపాదించాలో తెలియని రోజులలోనే తల్లిదండ్రులు మధుని, ఈ లోకాన్ని కూడా విడిచిపెట్టి పోయారు. “చదువు కొంటూ డబ్బు సంపాదించే తేలిక మార్గం ట్రైనింగు స్కూల్లో చేరటమే” అని యెవరో పుణ్యాత్ములు మధుకి సలహా యిచ్చారు. అది ఫలించింది. హయ్యరు గ్రేడు ట్రైనింగ్ పూర్తిచేసి ఎలిమెంటరీ స్కూలు జీవితం ప్రారంభించాడు. బస్తీలో ఇరవై రూపాయలు తాను తెస్తే ఎల్లాగో అల్లాగ తనకొక్కడికీ జీవయాత్ర గడుస్తుందేమో కొందరి మత ప్రకారం. కాని చిన్నతనంలోనే తనకొక గుదిబండను తగిలించి మరీ వెళ్ళారు చిన్నతనంలో తనని విడిచిపెట్టి పోయిన తల్లిదండ్రులు.

కొత్త సంవత్సరంప్రారంభం కావటానికి కాచుకొని సిద్ధంగా ఉన్న వసంత ఋతువులాగ మధు నూతన జీవితయాత్ర ప్రారంభించేసరికి వసంత అతని జీర్ణకుటీరంలో వెన్నెల అయింది

పరిస్థితులు ఏ రకంగా ఉన్నా మధు అంటేనే వసంతం కనక వాళ్ళజీవితయాత్ర ఆనందంగానే

గడుస్తూఉంది. వసంత అమాయకురాలు. ఎంత తెలివి తక్కువదైనా పుష్కలంగా ధనం ఉంటే గృహనిర్వహణం సాగించటం తేలికే. కాని వీళ్ళ సంసారం నడిమితరగతికి చెందిందని కూడా చెప్ప లేం. ఎంత పొదుపుగా గడపుకొనే వాళ్ళకైనా ఆ తరగతి సంపాదన సరిపోదు. ఇంతకంటె ఏవిధం గానూ అదనంగా సంపాదించలేని మధు, వసంత కూడా ఏదో సంపాదిస్తేనేకాని జీవయాత్ర గడప లేమని భావించాడు. ఈ ఆలోచన మొదట తాను వసంతతో చెప్పటానికే కొంచెము బెదిరాడు. చివరకి ఇదివిని వసంత మొదట్లో నవ్వుకొంది;అప్పు డామె ముఖం చూచి తన ఆలోచనద్వారా వ్యక్తమైన అసమర్థతకు సిగ్గుపడ్డాడు.

ఏమైనా అనాథశరణాలయంలో తల్లిదండ్రులు లేని చంటిపిల్లల్ని పెంచే బాధ్యత వసంతకుద్యో గంగా లభించింది. దానితో వీరి జీవయాత్ర మునుపటికంటె మంచిదారిలో పడినమాట నిజమే కాని చిన్నపిల్లయిన వసంతకు ఆపనికీ సరిగా అతక లేదు. సాయంకాలం యింటికి వచ్చినప్పుడు శరణాలయంలో పిల్లలతో తనప్రాణం ఎంత విసిగిపోతున్నదీ మధుతో చెప్పుదామనుకొంటుంది. కాని చెప్పితే అతను బాధపడతాడేమో! అంత టితో ఆగక తనని ఉద్యోగం మానిపిస్తే యీ నడిచే బండికూడా పట్టాలు తప్పుతుందేమో అనే భయంతో కొన్నాళ్ళదాకా తనబాధ తానేపడింది. తానుచేసే పనిలోమాత్రం వసంతచూపిన శ్రద్ధా భక్తులు ఆమెకు క్రమంగా ఓర్పును నేర్పటమేకాక యీనాటికాపనికామె తగినదే అనే పేరుకూడా తెచ్చిపెట్టింది. తాను దారితప్పకుండా నడుస్తూ ఉన్నట్టు నమ్మకం కలిగి కనుచూపుమేరలో లక్ష్యం కనిపిస్తుందని గుర్తించిన తర్వాతమాత్రం వసంత తనభర్తతో తన ఉద్యోగపు కష్టసుఖాలపై ప్రసం గించటం ప్రారభించింది. అంతవరకు తనకష్టాన్ని మధుకి చెపితే ఆడదానికి పిల్లల్ని పెంచటం చేత కాకపోతే యింకేముందంటాడని భయపడింది కాని అసలు మధుమనస్సులో వసంత ఉద్యోగంవిషయం ఒక సమస్యగానే ఉండిపోయింది. తానైవసంతని నీవాపిల్లలతో ఎల్లాయాతనపడుతున్నావని అడుగు దామని నోటి చివరిదాకా వచ్చి కూడా తానే మింగేశాడు. కారణం వసంత పడే బాధకు తానే కారణం అవటం ఒకటి. అంతకంటె తాను చేయ గలిగింది లేకపోవటం రెండవది. వసంత శరణాల యంలో సుఖపడుతోందని మధు ఎన్నడూ అనుకో లేదు. రెండు సంవత్సరాలు "చైల్డు సైకాలజీ"ని గురించి చదువుకొనివచ్చినా స్కూలులో పిల్లలకి ముక్కులు తుడవలేక, తనే బాధపడుతూ ఉన్న ప్పుడు ఇరవైమంది పిల్లల్ని బెత్తం చేతిలో ఉన్నా అయిదు నిమిషాలపాటు నిశ్శబ్దంగా ఉంచలేక పోతున్నప్పుడు వేరువేరు వయస్సులలో ఉన్న అనాథ బాలబాలికలను వసంత సముదాయించి సంతృప్తిపడుతుందని ఎట్లా అనుకోగలడు? దాదాపు రెండు సంవత్సరాల అనుభవం తనకా విద్య నేర్ప లేకపోయినా తనకు కూడా అనివార్యమైన శ్రద్ధా భక్తులే కొంత తోడ్పడినప్పటికీ నిజంగా తనకు కలిగిన కుఱ్ఱవాడివలన మధు ఈనాటికి మంచి ఉపాధ్యాయుడైనాడు. ఇంతకుపూర్వం ఈ దంప తులు తమ ఉద్యోగాల ప్రసంగం యింటిదగ్గర అప్పుడప్పుడు చేస్తూఉన్నా సంభాషణలు సాగేవి. ఒక సంవత్సరంనుంచి వారికి పరస్పర హృదయాలు బాగా అర్థంకావటం ప్రారంభించాయి. కాని ఆ ప్రసంగాలు చేయటానికి తగిన సమయం లభించ లేదు. వాళ్ళిద్దరు బుద్ధులు సమంగా తమ కుఱ్ఱవాడి మీద కేంద్రీకరించి విద్యాభ్యాసంప్రారంభించారు. ఇప్పటికి వాళ్ళకి సరిపడిన చదువు వచ్చింది.

ఈ సంగతులే ఆలోచించుకొంటూ కూర్చున్న తల్లిదండ్రుల్ని "యింటికి పోదా"మన్న కొడుకు అవ్యక్త ధ్వని మేల్కొల్పింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నాడు మధు నవ్వుతూ.

"రేపు చెపుతానులెండి యింటికి పోదాము" అన్నది వసంత తొందరగా లేస్తూ.

"నాకు తెలుసు నీ ఆలోచన" అన్నాడు మధు.

"మీ ఆలోచన నాకూ తెలిసిపోయిం" దంది వసంత నడుస్తూ.

"ఏమైనా రేపు మనం మాట్లాడుకోవాలి ఈ విషయం"అన్నాడు మధు ఆమె ననుసరిస్తూ. ★